సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 24 । జూలై । 2024




మృత్యు కౌగిలికి మరొకరు...
కాకినాడలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు యువకులు చనిపోగా మరో యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

II లో



మధుమేహపు కోత
మధుమేహం చేసే హాని గుండె కోతకు కారణమవుతోంది. చంటిపిల్లల్లా చూసుకున్న శరీర భాగాలు కళ్ల ముందే దేహం నుంచి వేరుపడుతుంటే ప్రాణం పోయినంత పనవుతుంది.

డెల్టాలకు 3,300 క్యూసెక్కులు
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,200, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.



న్యూస్‌రీల్

సీసీఆర్‌సీల నమోదు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కౌలు రైతులకు పంట సాగు హక్కు కార్డుల (సీసీఆర్‌సీ) నమోదు ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 271 రెవెన్యూ గ్రామాల్లోని 1,09,450 మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 52,391 మందికి మాత్రమే నమోదు చేశారని చెప్పారు. మిగిలిన 57,059 మంది కౌలు రైతులకు వారం రోజుల్లో కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలకు ఎనిమిది మండలాల్లో పంటలు నీట మునిగి, నష్టం జరిగే అవకాశం ఉన్నందున సీసీఆర్ కార్డుల ప్రక్రియను వెంటనే చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు 4లోగా చెల్లించాలి

రాజమహేంద్రవరం రూరల్: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ 2018–20 బ్యాచ్‌లో మేనేజ్‌మెంట్, స్పాట్ అడ్మిషన్లలో మొదటి సంవత్సరం ఒకసారి ఫెయిలైన అభ్యర్థులు వచ్చే నెల నాలుగో తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలి. జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఏఎం జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పరీక్ష ఫీజును సంబంధిత ప్రభుత్వ, ప్రైవేటు డీఈఎల్‌ఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు చెల్లించాలని సూచించారు. వివరాలకు సంబంధిత ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు.

ఏలేరుకు జలకళ

ఏలేశ్వరం: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు రిజర్వాయర్ క్రమంగా జలకళను సంతరించుకుంటోంది. పరివాహక ప్రాంతం నుంచి జలాశయంలోకి 9,107 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పాటు తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా మంగళవారం 76.50 మీటర్లుగా నమోదైంది. జలాశయం గరిష్ట సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వలు 9.70 టీఎంసీలకు చేరాయి. విశాఖకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మహా ప్రవాహం.. మహోగ్ర రూపం



రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవు వద్ద గోదావరి పరవళ్లు

- వరద ఉధృతితో ఉరకలేస్తున్న గోదావరి
- దవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- భద్రాచలంలో తగ్గుముఖం
- కాటన్ బ్యారేజీ వద్ద నేడు కాస్త తగ్గే అవకాశం
- ఇంకా ముంపులోనే పొలాలు, గ్రామాలు

సాక్షి, రాజమహేంద్రవరం: ఎగువ నుంచి వస్తున్న మహా ప్రవాహంతో జిల్లాలో గోదావరి మహోగ్ర రూపం దాల్చుతోంది. అంతకంతకూ వరద ఉధృతి పెరుగుతోంది. ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం రాత్రి 2 గంటల సమయానికి 13.75 అడుగులకు చేరింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక ప్రకటించారు. ఆ తర్వాత క్రమంగా పెరుగుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం మంగళవారం ఉదయం 6 గంటలకు 13.90 అడుగులకు చేరింది. 13,09,074 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం సాయంత్రం 6 గంటలకు 14.60 అడుగులకు చేరడంతో 14,09,718 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ఎగువన భద్రాచలంలో వరద ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. అక్కడ ఉదయం 5 గంటలకు 51.30 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రం 5 గంటలకు 50.70 అడుగులకు తగ్గింది. భద్రాచలం నుంచి వరద నీరు ధవళేశ్వరం చేరుతున్న నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం వరకూ ఇక్కడ నీటి ప్రవాహం మరింతగా పెరిగి.. సాయంత్రం నుంచి తగ్గుముఖం పడుతుందని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు.



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోకి ప్రవేశించిన గోదావరి వరద

ముంపులోనే..

- గోదావరి, ఎర్ర కాలువ వరదలతో పలు గ్రామాలు ఇంకా ముంపులోనే కొనసాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో రాకపోకల పునరుద్ధరణకు అవకాశం ఏర్పడింది. పంట పొలాలు, ఉద్యాన పంటలు మాత్రం ముంపులోనే ఉన్నాయి.
- కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోకి వరద ప్రవాహం వచ్చి చేరింది. మద్దూరులంక ముంపునకు గురైంది. భారీగా వస్తున్న గోదావరి వరద నీరు గ్రామంలోకి చొరబడకుండా ఇసుక బస్తాలతో గట్టును పటిష్టం చేస్తున్నారు.
- తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం లంక భూమిని గోదావరి వరద తాకింది. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు కొవ్వాడ కాలువ ఉధృతి కూడా కొనసాగుతోంది. రాగోలపల్లి – తాళ్లపూడి రోడ్డు, అన్నదేవరపేట – వేగేశ్వరపురం మధ్య కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వరద నీరు లంక గ్రామాలను తాకుతూండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
- సీతానగరం మండలం బొబ్బిల్లంక – ములకల్లంక మధ్య గోదావరి పరవళ్లు తొక్కుతోంది. ములకల్లంక గ్రామాన్ని అధికారులు సందర్శించారు. ప్రవాహం అధికమైతే ఇక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.
- పెరవలి మండలంలో వశిష్ట గోదావరి వరద ప్రభావం ఎక్కువగా ఉంది. మూడు రోజులుగా నిలకడగా ఉన్న గోదావరి రాత్రికి రాత్రే ఒక్కసారిగా ఉధృతమైంది. సోమవారం దిగువ లంకలు ముంపునకు గురవగా.. మంగళవారం ఉదయం ఎగువ లంకలను సైతం ప్రవాహం ముంచెత్తింది. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల పరిధిలో రైతులు సాగు చేసిన కోకో, అరటి, కంద, పసుపు, పామాయిల్, చెరకు, జామ, బొప్పాయి, కొబ్బరి, తమలపాకు, కూరగాయల పంటలు, పూల తోటలు, మొక్కజొన్న తోటలు నీటిలో మునిగిపోయాయి. వాణిజ్య పంటలైన కంద, పసుపు సైతం ముంపులో చిక్కుకుని దెబ్బ తిన్నాయి.

ఎర్ర కాలువ శాంతిస్తున్నా..

ఎర్ర కాలువ ఉధృతి కొంత మేర తగ్గుముఖం పట్టింది. దీంతో నిడదవోలు మండలం కంసాలిపాలెం, మాధవరం, సింగవరం మధ్య రాకపోకలను పునరుద్ధరించారు. అయినప్పటికీ ఆయా గ్రామాల ప్రజలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నారు. సింగవరం, తాళ్లపాలెం, తిమ్మరాజుపాలెం ఎస్సీ కాలనీలను వరద నీరు చుట్టుముట్టింది. పంటలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. ఎర్ర కాలువ ఉధృతితో జలదిగ్బంధంలో చిక్కుకున్న నల్లజర్ల మండలం చోడవరం, గుండేపల్లి గ్రామాల్లో ప్రవాహం కొంత మేర తగ్గింది. గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో గోపాలపురం, వాదాలకుంట, జగన్నాథపురం, దొండపూడి, చిట్యాల, అనంతపల్లి గ్రామాల్లోని కాలనీల్లో నీటి ఉధృతి కొనసాగుతోంది.

అన్నదాతల కన్నీరు

ఖరీఫ్ సాగుకు ఆది నుంచీ అనుకూల వాతావరణం ఏర్పడటంతో రైతులు ఆనందించారు. ఈసారి మంచి దిగుబడి దక్కుతుందని భావించారు. రెట్టింపు ఉత్సాహంతో సాగుకు శ్రీకారం చుట్టారు. కానీ, అంతలోనే మారిన వాతావరణంతో కుండపోత వర్షాలు, వరదలు వారి ఆశలపై నీళ్లు జల్లాయి. గోదావరి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో పొలాలు నీళ్లలోనే ఉన్నాయి. నారుమళ్లు, వరి నాట్లు కుళ్లిపోతున్నాయి. పశుగ్రాసానికి సైతం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల పరిధిలోని 207 గ్రామాల్లో వరద ప్రభావం కొనసాగుతోంది. 53,550 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవగా.. 17,674 మంది రైతులకు చెందిన 16,057 హెక్టార్ల విస్తీర్ణంలో వరి, చెరకు, మినుము పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 48 హెక్టార్లలో నారుమళ్లు నీట మునిగాయని నిర్ధారించారు. అత్యధికంగా నిడదవోలులో 3,392 హెక్టార్లలో వరి నాట్లు, 20 హెక్టార్లలో చెరకు పంట నీటి పాలయ్యాయి. సీతానగరం మండలంలో 3,315, ఉండ్రాజవరంలో 2 వేలు, కడియంలో 977, గోపాలపురంలో 864, కొవ్వూరు మండలంలో 560 హెక్టార్లలో వరికి నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు.



పెరవలి మండలం ముక్కామలలో నీట మునిగిన మొక్కజొన్న తోట



పెరవలి మండలం ముత్యాలవారిపాలెంలో వరద నీట మునిగిన బెండ తోట



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం లంక భూముల్లో గోదావరి ముంపులో చిక్కుకున్న కూరగాయల పంటలు



గోదావరి వరద ఉధృతికి బ్యారేజీ వద్దకు కొట్టుకుని వచ్చిన పర్యాటక పంటు



పెరవలి మండలం ముక్కామలలో కాజ్‌వే పైకి చేరిన వరద నీరు



పెరవలి మండలం తీపర్రు పుష్కరాల రేవులో శివుని విగ్రహాన్ని తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద గోదారి

ప్రభుత్వ ధరలకే నిత్యావసర సరకులు ఇవ్వాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నిత్యావసర సరకులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినియోగదారులకు తెలిసేలా ప్రతి దుకాణం వద్ద ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని 8 రైతుబజార్లు, 70 షాపుల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నామని తెలిపారు.. అవసరం మేరకు టమాటాలు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, కూరగాయలు కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా అందిస్తున్నామన్నారు. వరదలు తగ్గిన తర్వాత కూరగాయల కొరత రాకుండా అధికారులు ముందుగానే అవసరం మేరకు కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో మొబైల్ కంటైనర్ల ద్వారా కూడా వినియోగదారులకు కూరగాయలు విక్రయించాలని మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.విజయ భాస్కర్, మత్స్య శాఖ అధికారి కృష్ణారావు, మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ జిల్లా అధికారి ఎం.సునీల్ వినయ్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.రాధిక, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా పశు సంవర్ధక అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు ఉదారంగా రుణాలివ్వాలి



కేంద్ర ప్రభుత్వ ధ్రువపత్రాన్ని చూపుతున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): అల్పాదాయ వర్గాలకు, స్వయం సహాయక సంఘాలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, కౌలు రైతులకు బ్యాంకర్లు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్షా కమిటీ, జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఖరీఫ్, రబీ రుణ ప్రణాళికలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో జిల్లాలోని 6,465 మంది రైతులకు స్వల్పకాలిక రుణాలు మంజూరు చేయాలన్నది లక్ష్యం కాగా, 6599 మందికి అందించారన్నారు. 2,828 మందికి టర్మ్ రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా, అదనంగా 3,454 మందికి మంజూరు చేశారని తెలిపారు. 98,429 మంది కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందగా, 67,876 మందికి రూ.659.26 కోట్ల మేర రుణాలు అందజేశారన్నారు. జిల్లాలో 18,530 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.711.16 కోట్ల రుణాలు అందించాల్సి ఉండగా, 18,996 గ్రూపులకు రూ.1,794.72 కోట్లు అదనంగా అందించారని తెలిపారు. బ్యాంకర్లు విధిగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలు నిర్వహించాలని, నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు ఎంపికైన వారికి ఐదు రోజుల శిక్షణ ఇచ్చి, అవసరమైన టూల్ కిట్లు అందించేందుకు రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ప్రశాంతి విడుదల చేశారు. ప్రధానమంత్రి స్వనిధి పథకం అమలులో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ధ్రువపత్రాన్ని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు కలెక్టర్ అందజేశారు.

ఆశనిరాశలు



- మాట నెరవేరుస్తారా.. ‘సీత’కన్ను వేస్తారా?
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు
- కేంద్ర మంత్రి మాటలు నిజమైతే ప్రగతికి ఊతమంటున్న కొందరు
- మొండిచేయి చూపుతారేమోనని పలువురి సందేహం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చేసిన ప్రకటన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వివిధ రంగాలకు ఊతమిస్తుందని కొంతమంది చెబుతున్నారు. అయితే చివరిలో ‘సీత’ కన్ను వేసి, మొండిచేయి చూపుతారేమోనని మరి కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈసారైనా ‘దారి’ చూపుతారా?

జాతీయ రహదారులు, విశాఖ – చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్ర మంత్రి బడ్జెట్‌లో ప్రకటించారు. జిల్లాల మధ్య రహదారి వ్యవస్థ బలోపేతానికి చేయూతనందిస్తామని చెప్పారు. దీనిపై కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ప్రజలు ఆశలు పెట్టుకుంటున్నారు. వాస్తవానికి ఈ రహదారుల్లో చాలా వరకూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించి, సాధించుకున్నవే కావడం విశేషం.

- కాకినాడ – అన్నవరం మధ్య సముద్ర తీర ప్రాంతం మీదుగా 45 మీటర్ల వెడల్పుతో 40.319 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం ఈసారైనా జరగవచ్చని భావిస్తున్నారు. ఇది పూర్తయితే కాకినాడ పోర్టుతో పాటు తీరంలో పారిశ్రామికీకరణ ఊపందుకునే అవకాశాలుంటాయి.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం నుంచి రావులపాలెం వరకూ 35 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణంపై కూడా ఆ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వందలాది వాహనాలతో నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ రోడ్డు చాలా ఇరుకుగా ఉంటూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు జాతీయ రహదారిగా గుర్తింపు సాధించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి పినిపే విశ్వరూప్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈ రోడ్డును సుమారు రూ.400 కోట్లతో జాతీయ రహదారిగా అభివృద్ధి చేసేందుకు అప్పట్లో కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం కూడా తెలిపింది. ఈ రోడ్డు జాతీయ రహదారిగా అభివృద్ధి చెందితే ప్రమాదాలు తగ్గడంతో పాటు సమయం కూడా కలసి వస్తుంది.
- రాజమహేంద్రవరం నగరంలో మోరంపూడి ఫ్లైఓవర్ వంతెన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే పట్టాలెక్కింది. 1.42 కిలోమీటర్ల నాలుగు లేన్ల ఈ వంతెన పనులను రూ.60 కోట్లతో చేపట్టారు. బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించి ఈ వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు ఆశిస్తున్నారు.

పారిశ్రామిక వెలుగులు ప్రసరించేనా!

అనేక వివాదాలతో అభివృద్ధికి నోచుకోని కాకినాడ సెజ్ సమస్యకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిష్కారం చూపించారు. ఈ నేపథ్యంలో పలువురు పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు. ఇప్పటికే పెరుమాళ్లపురం వద్ద సాగర తీరంలో రూ.2,123 కోట్లతో గేట్‌వే పోర్టు, రూ.2,500 కోట్ల అరబిందో గ్రూపు పెన్సిలిన్ జీ, రూ.2,000 కోట్లతో దివీస్ ఫార్మా వంటి పరిశ్రమల పనులు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. వీటితో పాటు రూ.422 కోట్లతో ఉప్పాడ మేజర్ హార్బర్ నిర్మాణం కూడా నాటి సీఎం జగన్ హయాంలోనే ప్రారంభమయ్యింది. ఈ తరుణంలో బడ్జెట్‌లో పారిశ్రామికీకరణకు పెద్ద పీట వేస్తామని కేంద్ర మంత్రి నిర్మలమ్మ ప్రకటించడంతో ఇక్కడ పరిశ్రమలు వస్తాయేమోనని పలువురు ఆశ పడుతున్నారు.

బంగారం వ్యాపారానికి ఊతం!

బంగారంపై సుంకం తగ్గిస్తున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. దీంతో వీటి ధరలు దిగి వచ్చి, బంగారం వ్యాపారం పెరుగుతుందని బులియన్ మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా రాజమహేంద్రవరం నగరంలో ప్రతి రోజూ రూ.15 కోట్ల మేర బంగారు ఆభరణాల విక్రయాలు జరుగుతూంటాయి. కాకినాడ నగరంలో నెలకు రూ.20 కోట్లు, అమలాపురం, మండపేట వంటి పట్టణాల్లో నెలకు ఐదారు కోట్ల రూపాయల మేర బంగారం వర్తకం జరుగుతూంటుంది. ఇది మరింత పెరగవచ్చని బంగారు వర్తకులు ఆశిస్తున్నారు.

వీటిపై పెదవి విరుపే..

- కేంద్ర బడ్జెట్‌లో రైతులకు, యువతకు పెద్దగా ప్రాధాన్యం ఇచ్చామని చెబుతున్నా ఆ స్థాయిలో ప్రయోజనాలు కనిపించడం లేదని రైతు సంఘాల ప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల తయారీకి అవసరమైన రసాయనాలపై ఈ బడ్జెట్‌లో పన్నులు పెంచాలని ప్రతిపాదించారు. దీంతో ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగి రైతులపై భారం పడనుంది.
- కాకినాడలో పెట్రో ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, పిఠాపురం – కాకినాడ రైల్వే లైన్‌ను మెయిన్ లైన్‌తో అనుసంధానం చేసే ప్రాజెక్టుకు చోటు దక్కక పోవడం కాకినాడ జిల్లా వాసులను నిరాశపరిచింది.
- కోనసీమకు రైల్వే లైన్ ప్రాజెక్టుపై ఈ బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావనా లేదు. గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేటాయించిన రూ.300 కోట్లకు అదనపు కేటాయింపులు ఉంటాయని ఈ ప్రాంత వాసులు ఎదురు చూసినా నిరాశే ఎదురైంది.

టీడీపీ విఫలం



సీఎం చంద్రబాబు రూ.లక్ష కోట్లు అడిగారు. అయితే బిహార్‌కు రూ.40 వేల కోట్ల వరకూ ప్రయోజనం కల్పించి, అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు మాత్రమే ప్రకటించారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ గట్టిగా అడగనందువల్లనే బడ్జెట్‌లో మనకు తక్కువ నిధులు కేటాయించారు. మెజార్టీ ఎంపీలు ఉండి ప్రశ్నించి నిధులు రాబట్టుకోలేకపోవడం అన్యాయం.

– కర్నాకుల వీరాంజనేయులు, ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జగ్గంపేట

ఉన్నత విద్య ప్రస్తావన లేదు



ఈ బడ్జెట్‌లో ఉన్నత విద్యకు పెద్దగా ప్రస్తావన ఏదీ కనిపించలేదు. మౌలిక సదుపాయాలకు మాత్రం కొంతవరకూ కేటాయింపులు పెంచారు. రోడ్లు, విద్య, ఆరోగ్యంపై పెట్టే ప్రతి పైసా పెట్టుబడిగానే భావించాలి తప్ప ఖర్చుగా చెప్పకూడదు. బడ్జెట్‌లో పెట్టిన సొమ్ములను రాష్ట్రం రాబట్టడంలోనే అసలు కిటుకు ఉంది.

– డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ, రాజానగరం

‘పోలవరం’ పట్టాలెక్కితే మంచిదే..



పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ఏపీకి మంచిదే. రాజమహేంద్రవరంలో వ్యాపారాలు బాగా జరుగుతాయి. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే అన్ని రంగాలూ అభివృద్ధి సాధిస్తాయి.

– మద్దుల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి, రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్

క్లుప్తంగా

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

ఏడీబీ రోడ్డులో త్రుటిలో తప్పిన ప్రమాదం

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులో మంగళవారం ఉదయం స్కూల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీ కొంది. ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువ భాగంలో పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఏడీబీ రోడ్డులో విద్యార్థులను కాకినాడలోని స్కూల్‌కు ఎక్కించుకోవడానికి బస్సు ఆగింది. ఆ తరుణంలో తెలంగాణ రాష్ట్రం గజ్వేల్ నుంచి బియ్యం లోడుతో కాకినాడ పోర్టుకు వెళుతున్న లారీ.. ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీ కొంది. దాంతో ప్రైవేటు స్కూల్ బస్సు వెనుక అద్దాలు పగిలిపోయాయి. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 20 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్కూల్ యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో మరో బస్సులో విద్యార్థులను కాకినాడ స్కూల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

52 ఏళ్ల మహిళపై అత్యాచార యత్నం

నిందితుడి అరెస్టు

మామిడికుదురు: ఇంట్లో వంట చేస్తున్న 52 ఏళ్ల మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించిందని నగరం ఎస్సై పి.సురేష్ మంగళవారం తెలిపారు. పాశర్లపూడి కైకాటపేటకు చెందిన నిందితుడు గెద్దం సత్యనారాయణమూర్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించిందన్నారు. వరుసకు మరిది అయిన నిందితుడు ఆమెపై కన్నేసి గత నెల 18వ తేదీ రాత్రి వంట చేస్తుండగా ఇంట్లో ప్రవేశించి ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడగా ఆమె ప్రతిఘటించి కేకలు వేసిందన్నారు. దీంతో నిందితుడు పరారయ్యాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చామన్నారు.

కనకదుర్గ గుడిలో చోరీ

పిఠాపురం: స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న కనకదుర్గాలయంలో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. అమ్మవారి చెవి దిద్దులు, బొట్టు, రెండు జతల మంగళ సూత్రాలు, సుమారు 17 గ్రాములు విలువ కలిగిన బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఆలయ చైర్మన్ తుబక ఈశ్వరరావు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం పోలీసులు వచ్చి నిందితుడి వేలిముద్రలు సేకరించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగను పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. నిందితుడు కోనసీమ జిల్లా మలికిపురానికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

మధుమేహపు కోత

- సుగర్ ప్రభావంతో పెరుగుతున్న గాంగ్రిన్ కేసులు
- చేతి, కాళ్ల వేళ్లు తొలగించాల్సిన దయనీయ స్థితి
- నాలుగున్నరేళ్ల కాలంలో జీజీహెచ్‌లో 1,362 ఆంపిటేషన్లు
- మధుమేహంపై అవగాహన లేకే ఈ స్థితి అంటున్న వైద్యులు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మధుమేహ బాధితులు

కాకినాడ క్రైం: మధుమేహం చేసే హాని గుండె కోతకు కారణమవుతోంది. చంటిపిల్లల్లా చూసుకున్న శరీర భాగాలు కళ్ల ముందే దేహం నుంచి వేరుపడుతుంటే ప్రాణం పోయినంత పనవుతుంది. అప్పటివరకు దేహాన్ని ఇంధనంలా నడిపిన మన కాలో, చెయ్యో, ఇంకేదైనా శరీర భాగాలో ఆపరేషన్ థియేటర్ చెత్త బుట్టలో దర్శనమిస్తుంటే దిగమింగుకోలేని ఆవేదన కనుపాపల్ని తడిపేస్తుంది. అంతులేని వేదనై యావత్ జీవితాన్ని కుదిపేస్తుంది. మీకు సుగర్ వ్యాధి ఉందా... మందులు వాడటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారా. ఫలితంగా రక్తనాళం మూసుకుపోయి రక్త ప్రవాహం ఆగిపోయిందా... అయితే తస్మాత్ జాగ్రత్త రక్తం ప్రవహించని దేహంలో ఏ భాగమైనా అర్ధంతరంగా తొలగించాల్సిన పరిస్థితి రావచ్చు. అలా తొలగించకపోతే కమ్ముకొచ్చే అపాయం యావత్ దేహాన్నే కబళించవచ్చు. మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తున్న వేలాదిమంది ఆ ఫలితాన్ని అనుభవిస్తున్నారు.

ఎందుకు ఈ స్థితి?

అన్ కంట్రోల్డ్ డయాబెటిస్, పెరిఫెరల్ వ్యాస్క్యులర్ డిసీజ్, డయాబెటిక్ న్యూరోపతి కండీషన్లలో శరీర భాగాన్ని తొలగించాల్సిన దుస్థితి ఎదురవుతుంది. ఈ స్థితిలో రక్తప్రసరణకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. రక్తనాళాలు మూసుకుపోవడం లేదా ప్రసరణకు పనికి రాకుండా పాడవడం వల్ల రక్త ప్రవాహం శరీర భాగాలకు జరగదు. ముఖ్యంగా రక్తం ఊర్ధ్వముఖంగా ప్రవహించే కాళ్లకు ఈ సమస్య ఎక్కువ. ఈ స్థితితో రక్త ప్రవాహం కోల్పోయిన దేహంలోని భాగం కుళ్లడం మొదలవుతుంది. ఇది ఇన్‌ఫెక్షన్‌కు గురై శరీరానికి వ్యాప్తి చెందుతుంది. ఆ వ్యాప్తిని నిలువరించడానికి ఆంపిటేషన్ (శరీర భాగాన్ని తొలగించేందుకు చేసే ప్రక్రియ) అనివార్యమవుతుంది.

సుగర్ కాకుండా...

మధుమేహం కాకుండా ధూమపానం, కుష్టువ్యాధి, వెన్నెముక గాయం, వెరికోజ్ వెయిన్స్, క్యాన్సర్ వల్ల ఏర్పడే పుండ్లు కారణంగా కూడా ఆంపిటేషన్ నిర్వహిస్తారు. ఎక్కువ సేపు నిలబడి పనిచేసే వారిలో కూడా ఈ సమస్య తలెత్తుతుంది. న్యూరోపతి స్థితిలో రక్త ప్రవాహం లేక స్పర్శ కోల్పోతారు. అటువంటి సమయంలో గాయాలు అయినా నొప్పి తెలియదు. దీంతో బాధితుడు గాయం కనిపించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తాడు. ఈ స్థితి ప్రమాదకరంగా పరిణమిస్తుంది.

పెరుగుతున్న ఆంపిటేషన్లు

మధుమేహ నిర్లక్ష్యం వల్ల శరీర భాగాలు దెబ్బతిని, వాటిని తొలగించాల్సిన స్థితి నానాటికీ అధికమవుతోంది. ఆంపిటేషన్‌గా పిలిచే ఈ ప్రక్రియను కాకినాడ జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియల నిర్వహణలో గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో స్పష్టమైన పెరుగుదల కనిపించింది.

సంవత్సరాల వారీగా..

2020లో	211
2021లో	93
2022లో	305
2023లో	472
2024 జూన్ వరకు	281

50 ఏళ్లు పైబడ్డ పేదలే అధికం..

గాంగ్రీన్‌కి గురవుతున్న వారిలో 50 ఏళ్లకు పైబడిన పేదలే అధికంగా ఉంటున్నారు. పేదరికంలో ఉన్న ఆ వయసు వ్యక్తుల జీవన శైలి ఆరోగ్య స్థితిగతులపై కుటుంబ సభ్యుల్లో పర్యవేక్షణ లోపిస్తుంది. రోజు వారీ కూలి పనులు, పొలం పనులు చేసుకుంటూ వ్యవసాయంలో తలమునకలయ్యే వారు తరచుగా గాయాలకు గురవుతుంటారు. తెలియని తనంతో తమ మధుమేహ స్థాయిని పరిశీలించుకోరు. సుగర్ వల్ల నీరసం వస్తున్నా శ్రమ వల్ల అనుకుంటారు. దీంతో వారిలో మధుమేహ స్థాయి అసాధారణంగా పెరుగుతుంది. కొనసాగింపుగా రోజువారి కార్యకలాపాలలో భాగంగా వారికి అయ్యే గాయాలు ప్రాణసంకటంగా మారుతుంటాయి.

అప్రమత్తంగా లేకపోతే అపాయమే



మధుమేహ బాధితులు గాంగ్రీన్ స్థితికి చేరడం అపాయకరం. ఎప్పటికప్పుడు వైద్యుడి సూచనల మేరకు సుగర్ నియంత్రణపై దృష్టి సారించాలి. సమతులాహారం, వ్యాయామం, నడక ద్వారా డయాబెటిస్‌ను నియంత్రించుకోవాలి. మందులు క్రమం తప్పకుండా వాడాలి. గాంగ్రీన్ తొలి దశలో కాళ్ల నొప్పి, వాపు నీటి బుడగలు ఏర్పడతాయి. అరికాళ్ల మంటలు వస్తాయి. జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది. మానని గాయాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. స్పర్శ తెలియని చోట గాయం అయితే అప్రమత్తం అవ్వాలి.

– డాక్టర్ వై.చిరంజీవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్ అనస్థీషియా, ఆర్ఎంసీ, కాకినాడ

మృత్యు కౌగిలికి మరొకరు...

- మూడుకు చేరిన మృతుల సంఖ్య
- కాకినాడ కారు ప్రమాద ఘటనలో చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ మృతి



జక్కల దుర్గాప్రసాద్ (ఫైల్)

కాకినాడ క్రైం: కాకినాడ కారు ప్రమాదం విషాద గీతికలను లిఖిస్తూనే ఉంది. శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు యువకులు చనిపోగా మరో యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. నగరంలోని టూ టౌన్ పీఎస్ సమీపంలో ఉన్న ముమ్మిడివారి వీధికి చెందిన జక్కల దుర్గాప్రసాద్(32) ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కారు ఢీకొన్న ధాటికి దుర్గాప్రసాద్ కుడి కాలు తెగిపడింది. ఈయన తండ్రి ప్రమాద స్థలిలో కుమారుడి కాలు వెతికి అంబులెన్స్ వెనక ఏడుస్తూ పరుగులు పెట్టిన తీరు కంట తడి పెట్టించింది. అయితే విధి కనికరించలేదు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్ ప్రమాదం వల్ల అధిక మొత్తంలో రక్తం కోల్పోయాడు. వైద్య బృందం నాలుగు రోజుల పాటు క్షతగాత్రుడిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దుర్గాప్రసాద్ మరణించాడు. దుర్గాప్రసాద్‌కు ఎనిమిది నెలల క్రితమే వివాహం కాగా ఈయన భార్య సత్య ప్రస్తుతం ఐదవ నెల గర్భిణి. దుర్గాప్రసాద్ కనబోయే బిడ్డ కోసం ఎన్నో కలలుకన్నాడు. ఇదే విషయాన్ని కుటుంబసభ్యులు స్నేహితులు తలచుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కుమారుడి మరణ వేదనను తాళలేక దుర్గాప్రసాద్ తండ్రి మార్చురీ వద్ద గుండెలవిసేలా రోదించిన తీరు చూపరులను కలచివేసింది. మూడేళ్ల క్రితమే దుర్గాప్రసాద్ సోదరుడు మరణించాడు. ఇప్పుడు దుర్గాప్రసాద్ మరణించడం ఆ కుటుంబాన్ని అంతులేని వేదనలోకి నెట్టేసింది. ప్రమాదానికి కారణమైన చల్లా రామ్మోహన్ కాకినాడ జీజీహెచ్‌లోని న్యూరోసర్జరీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని వైద్యులు వెల్లడించారు.

విద్యుత్ ప్రమాదాలను నివారిద్దాం

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మూర్తి

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షాలు, గాలులు ఉన్న సమయంలో విద్యుత్తు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. వర్షాలు కురిసే సమయంలో ప్రజలు విద్యుత్తు ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుపాను సమయంలో గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ మోడ్‌లో ఉంచాలన్నారు. ఇంటి లోపల కరెంటు స్విచ్ బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువులను తాకనీయరాదని, ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాక కూడదన్నారు. వర్షం పడుతున్నపుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకొనరాదని, ఇంటి పరిసరాలలో చెట్లు, కరెంటు పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం, కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి వుంటే దానిని విద్యుత్ ప్రసారం ఉన్నదిగా పరిగణించి, సరియైన రక్షణ కల్పించే వరకు వాటిని నేరుగా తాకకుండా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియజేయాలన్నారు. మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వల్ల నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లు, భవన నిర్మాణాల సమయంలో నిర్మాణదారులు తగిన రక్షణ చర్యలు చేపట్టకుండా అజాగ్రత్తగా ఉండడం వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు.

పెరవలి కాలువలో మృతదేహం

పెరవలి: నరసాపురం కాలువలో పెరవలి వద్ద గుర్తు తెలియని మృతదేహం కొట్టుకు వెళుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ నెల 21వ తేదీ కొవ్వూరులో గోదావరి వద్ద కాళ్లు కడుగుకుంటూ ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి కనిపించకుండా పోయిన నల్లజర్ల మండలం ఆవపాడు గ్రామానికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ మృతదేహం అయి ఉంటుందని అనుకుంటున్నారు. మృతదేహం కనిపించిన వెంటనే ఎవరికి చెప్పాలో తెలియక కొంత సేపు, చెబితే ఏమి జరుగుతుందోనని మరికొంత సేపు స్థానికులు ఆలోచనలో పడటంతో మృతదేహం ముందుకు వెళ్లిపోయింది. పోలీసులు గాలిస్తున్నారు.

దుండగుల దుర్మార్గం

- నిమ్మ మొక్కలపై కలుపు మందు స్ప్రే
- రూ.3 లక్షలకు పైగా నష్టపోయిన రైతు



చనిపోయిన నిమ్మ మొక్కల మధ్య బాధిత రైతు శ్రీను

కడియం: పచ్చని మొక్కలను చూసి కన్నుకుట్టిందో ఏమో.. రాత్రి పూట కలుపు మందు చల్లేశారు. దీంతో చిన్న రైతు రూ.మూడు లక్షల మేర నష్టపోయారు. కడియం మండలం కడియపులంకలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. కడియపులంక గ్రామానికి చెందిన తిర్నాతి శ్రీను నర్సరీలో మొక్కలు సాగు చేస్తుంటారు. ఈ ఏడాది నిమ్మ మొక్కలను పెంచారు. మొక్కలు అమ్మకానికి సిద్ధమయ్యాయి. 200 మొక్కలను కొనుగోలుదారులు కూడా వచ్చి కొనుక్కున్నారు. వారు రవాణా చేసుకునేందుకు సిద్ధంగా బుట్టలు కట్టి సిద్ధం చేశారు. మిగిలిన మొక్కలను కూడా కొనుక్కునేందుకు వ్యాపారులు ముందుకు వచ్చారు. కానీ శనివారం రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఈ మొక్కలన్నింటిపైనా కలుపు మందులను స్ప్రే చేసేశారు. దీంతో ప్రస్తుతం అవన్నీ చనిపోతున్నాయి. మంగళవారం శ్రీను కడియం పోలీస్‌లకు, నర్సరీ అసోసియేషన్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

బైక్‌లో తాచుపాము కూన



తాచుపాము కూనను పట్టుకున్న గణేష్ వర్మ

అమలాపురం టౌన్: స్థానిక రాయల్ పెట్రోలు బంక్ వద్ద ఓ బైక్‌లో గోధుమ తాచు కూన చేరడంతో కొద్దిసేపు అక్కడికి వచ్చిన వాహన చోదకులు భయాందోళనలకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన జరుగగా పెట్రోలు బంక్ యాజమాన్య ప్రతినిధులు స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు ఫోన్ చేసి అక్కడికి రప్పించారు. స్నేక్ క్యాచర్ ఆ పాము పిల్లను బైక్ నుంచి బయటకు తీసి సీసాలో బంధించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వరదలు పెరుగుతున్న కారణంగా పాములు ఇలా బహిరంగ ప్రదేశాలకు చేరుకుని అవి కూడా తలదాచుకునే ప్రయత్నం చేస్తాయని గణేష్ వర్మ తెలిపారు.

విద్యార్థి మృతదేహం గుర్తింపు



రాంబాబు మృతదేహం

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురానికి చెందిన పిప్పళ్ల రాంబాబు మృతదేహాన్ని (15) మిర్తిపాడు – బొబ్బిల్లంక మధ్యలోగల తొర్రిగడ్డ కాలువలో మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు గుర్తించారు. సెలవులపై తన ఇంటికి వచ్చిన రాంబాబును ఆదివారం సాయంత్రం తండ్రి మందలించాడని మనస్తాపంతో సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా రాకపోవడంతో గ్రామంలో గాలించారు. బొబ్బిల్లంక – మిర్తిపాడు తొర్రిగడ్డ కాలువ కల్వర్టు వద్ద రాంబాబు తీసుకువెళ్లిన సైకిల్ ఉండటంతో సోమవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన ఎస్సై టి.రామకృష్ణ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. తండ్రి వెంకటపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైసుమిల్లులో విద్యుత్ మోటార్ల చోరీ



విద్యుత్ మోటార్లతో పట్టుబడిన నిందితులు

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడిలోని రైసుమిల్లులో సోమవారం రూ.80వేలు విలువగల 8, మండపేటలో 3 మొత్తం 11 విద్యుత్ మోటార్లను వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు చోరీ చేశారు. రైసుమిల్లు నిర్వాహకులు పుట్టా కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు అదే రోజు కేసు నమోదు చేసినట్టు అంగర ఎస్సై అందె పరదేశీ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం...రైసుమిల్లును పర్యవేక్షించేందుకు కృష్ణమూర్తి ఉదయం వెళ్లగా తాళాలు తెరచిఉన్నాయి. ఎనిమిది మోటార్లు చోరీకి గురవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా చోరీకి పాల్పడిన మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన బొచ్చా తరుణ్, కాలే సుబ్రహ్మణ్యం, గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన అల్లగిరి సత్యసాయి చిట్టి గణేష్‌లను మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 11 విద్యుత్ మోటార్లు, పుల్లర్ బండి, మోటార్లను విప్పేందుకు వినియోగించే సామగ్రి స్వాధీనపర్చుకున్నారు. నిందితులను ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

పచ్చిమేతలో పోషక విలువలు

- ఎండు మేత పశువుల కడుపు నింపడానికే..
- పదో వంతు భూమిలో పచ్చగడ్డి గ్రాసాలు పెంచాలి



పాడి పశువుకు పచ్చిమేత

కొత్తపేట: పశువుల పోషణ రైతుకు పెనుభారమైన నేపథ్యంలో సమగ్ర పశుపోషణ పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. సమగ్ర పశుపోషణతోనే పశువులు ఆరోగ్యకరమైన జీవనం సాగించగలవని, ప్రధానంగా పచ్చిరొట్ట మేతల వల్ల పశువుల్లో పాల దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. ప్రధానంగా వేసవి తరువాత వచ్చే వర్షాకాలం ప్రారంభంలో పశువుల మేతకు కొరత లేకుండా చూసుకోవాలి. పచ్చి మేతల వల్ల పశువుకు పోషక విలువలు అందుతాయి. కొన్నేళ్లుగా పశువులను మేపేందుకు కాపరులు ఆ పనికి రాక, వచ్చినా పెద్ద మొత్తంలో జీతాలు డిమాండ్ చేయడంతో పశు పోషణ రైతులకు భారమైపోయింది. దీంతో స్వయంగా పచ్చిమేత సాగుతో పాడి పశువులను పోషించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

గడ్డిజాతుల్లో రకాలు

ధాన్యపు జాతి రకాలు

- హైబ్రీడ్ మొక్కజొన్న, మొక్కజొన్న ఉన్నాయి. హైబ్రీడ్ జొన్నల్లో పీసీ పూచాచారి 23, ఎంపీ చారి, ఎస్ఎస్‌జీ 53, ఎస్ఎస్‌జీ 59 అనే మూడు రకాలు ఎంపిక చేసుకోవాలి. మొదటి దశ కోత 60 రోజులకు వస్తుంది. ఎకరాకు 30 నుంచి 35 టన్నులు దిగుబడి వస్తుంది. ప్రతి 40 రోజులకు ఒక కోత చొప్పున 3 కోతలు వస్తుంది.
- మొక్కజొన్నలో ఆఫ్రికన్‌టాల్ లేదా గంగ, హైబ్రీడ్ ఎఫ్, విజయకిసాన్ రకాలు ఉన్నాయి. మొదటి కోత 60 నుంచి 70 రోజులకు వస్తుంది. 20 నుంచి 23 టన్నుల దిగుబడి వస్తుంది. 3 కోతల వరకూ వస్తుంది.

కాయజాతి పచ్చిమేతలు

- అలసందలో యూపీసీ 5236 రకం. ఈసీ 4216 రకం, ఐసీ 4216 రకం, రష్యన్ అలసంద రకాలు మంచివి. ఈ రకం 70 రోజులకు కోతకు వస్తుంది.
- పచ్చిమేత 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. ఒక కోత మాత్రమే వస్తుంది.
- పిల్లిపెసర మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 8 నుంచి 10 టన్నులు దిగుబడి వస్తుంది.
- జనుములో మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 50 శాతం పూత దశలో కోయాలి. ఒకే కోత ఉంటుంది. 7 నుంచి 9 టన్నుల దిగుబడి లభిస్తుంది.

ఇలా వివిధ గడ్డి జాతులు అధిక పాల దిగుబడికి దోహదపడతాయని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచించారు.

మేలుజాతి గడ్డి రకాలను పెంచాలి

రైతులు మేలుజాతి గడ్డి రకాలను పెంచుకోవాలి. తమకున్న పొలంలో పదో వంతు గర్భి సాగు వేయడం వల్ల పశుగ్రాసానికి కొరత ఉండదు. మేలుజాతి గడ్డి రకాలు తినడం వల్ల పశువులు అధిక పాలను ఇవ్వడం ద్వారా రైతులకు లాభాలు బాగుంటాయి.

– సీహెచ్ వెంకటనారాయణ,
ఏడీ, పశుసంవర్ధక శాఖ, కొత్తపేట

జిల్లాలో ఇదీ పరిస్థితి

పశువులు	సంఖ్య
పాడి గేదెలు	1,60,403
ఆవులు	75,839

పాడి-పంట

ప్రయోజనాలు ఇవీ..

ఎండు మేత పశువులకు కడుపు నింపడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. పచ్చిమేత కొరత రాకుండా చూసుకోవడానికి రైతు తన సేద్యభూమిలో పదో వంతు భూమిలో పచ్చగడ్డి గ్రాసాలు పెంచుకోవాలి. పచ్చిమేతలో అధిక పోషకాలు, విటమిన్లు ఎక్కువగా ఉండటం వలన ఎదకు త్వరగా రావడానికి, పాల ఉత్పత్తి పెరగడానికి ఉపయోగపడుతుంది. పచ్చి మేతల్లో కాయజాతి, కాయజాతి కానివి ఉంటాయి. కాయజాతిలో చిరుధాన్యాలు, గడ్డి రకాలు ఉంటాయి. కాయజాతి కాని రకాలు పశువులకు కావాల్సిన శక్తినివ్వడానికి, కాయజాతి రకాలు మాంసకృత్తుల వృద్ధికి దోహదపడతాయి. మేలు జాతి గడ్డి రకాలను రైతులు పెంచుకోవాలి. పచ్చగడ్డిలో 70 శాతం పోషకాలు ఉండగా ఎండుగడ్డిలో 30 శాతం మాత్రమే ఉంటాయి.

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు... 'ఖేలో ఇండియా'కే రూ. 900 కోట్లు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం క్రీడలకు ఇచ్చే వార్షిక బడ్జెట్‌ను స్వల్పంగా పెంచింది. మంగళవారం ప్రకటించిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఇచ్చిన రూ.3,396.96 కోట్లతో పోలిస్తే ఇది రూ.45.36 కోట్లు ఎక్కువ. ఎప్పటిలాగే ఇందులో ఎక్కువ మొత్తం దిగువ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దే 'ఖేలో ఇండియా' పథకానికే కేటాయించింది. గత ఏడాదికంటే రూ.20 కోట్లు ఎక్కువగా 'ఖేలో ఇండియా'కు ఈసారి రూ.900 అందిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్‌ల నిర్వహణతో పాటు అత్యుత్తమ స్థాయి శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, అక్కడ సౌకర్యాల కల్పన కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. మరోవైపు దేశవ్యాప్తంగా స్టేడియాల నిర్వహణ, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) కోసం ఖర్చు చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు ప్రభుత్వం రూ.822.60 కోట్లు కేటాయించింది. దేశంలోని వివిధ క్రీడా సమాఖ్యలకు ఈ సారి రూ.340 కోట్లు అందజేస్తున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా), జాతీయ డోపింగ్ టెస్టింగ్ లేబొరేటరీ (ఎన్‌డీటీఎల్)ల కోసం వరుసగా 21.73 కోట్లు, రూ. 22 కోట్ల చొప్పున కేటాయించారు.

అజేయంగా సెమీస్‌లోకి

- భారత మహిళల జట్టుకు 'హ్యాట్రిక్' విజయం
- రాణించిన షఫాలీ వర్మ, హేమలత, అరుంధతి


షఫాలీ

దంబుల్లా: అటు బ్యాటింగ్‌లో... ఇటు బౌలింగ్‌లో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా కప్ టి20 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. నేపాల్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 82 పరుగుల తేడాతో గెలిచింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు ఆరు పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకోవడంతో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (48 బంతుల్లో 81; 12 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (42 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 122 పరుగులు జోడించారు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా... హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి, రాధా యాదవ్ 2 వికెట్ల చొప్పున తీశారు. గ్రూప్ 'ఎ'లోని మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 10 వికెట్ల తేడాతో యూఏఈ జట్టును ఓడించింది. 4 పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంతో పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియాతో బంగ్లాదేశ్; థాయ్‌లాండ్‌తో శ్రీలంక తలపడతాయి.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (స్టంప్డ్) కాజల్ శ్రేష్ట (బి) సీతా రాణా మగర్ 81; హేమలత (సి) రుబీనా ఛెత్రి (బి) సీతా రాణా మగర్ 47; సజన (ఎల్బీడబ్ల్యూ) (బి) కబితా జోషి 10; జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 28; రిచా ఘోష్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1-122, 2-133, 3-156. **బౌలింగ్:** కబితా కున్వర్ 2-0-20-0, షబ్నమ్ రాయ్ 4-0-41-0, పూజా మహతో 1-0-13-0, కబితా జోషి 4-0-36-1, రుబీనా ఛెత్రి 1-0-14-0, ఇందూ బర్మ 4-0-29-0, సీతా రాణా మగర్ 4-0-25-2.

నేపాల్ ఇన్నింగ్స్: సంజానా ఖాడ్కా (బి) అరుంధతి రెడ్డి 7; సీతా రాణా మగర్ (బి) అరుంధతి రెడ్డి 18; కబితా కున్వర్ (సి) స్మృతి మంధాన (బి) రేణుక 6; ఇందూ బర్మ (సి) షఫాలీ (బి) రాధా యాదవ్ 14; రుబీనా ఛెత్రి (బి) దీప్తి శర్మ 15; పూజా మహతో (రనౌట్) 2; కబితా జోషి (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 0; బిందూ రావల్ (నాటౌట్) 17; డాలీ భట్టా (సి) రిచా ఘోష్ (బి) రాధా యాదవ్ 5; కాజల్ శ్రేష్ట (సి అండ్ బి) దీప్తి శర్మ 3; షబ్నమ్ రాయ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 96. వికెట్ల పతనం**: 1-8, 2-21, 3-43, 4-52, 5-64, 6-64, 7-70, 8-82, 9-93. **బౌలింగ్:** రేణుక సింగ్ 4-1-15-1, అరుంధతి రెడ్డి 4-0-28-2, తనూజా కన్వర్ 4-1-12-0, దీప్తి శర్మ 4-0-13-3, రాధా యాదవ్ 3-0-12-2, సజన 1-0-11-0.



ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రీడాకారులు పారిస్‌కు చేరుకున్నారు. భారత మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా, ప్రీతి, జైస్మిన్... బ్యాడ్మింటన్ స్టార్ సాత్విక్ సాయిరాజ్ అక్కడి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. క్రీడా గ్రామంలో టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌ను సాత్విక్ సాయిరాజ్, భారత టీటీ ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ కలిసి అతనితో ఫొటోలు దిగారు.



వీళ్ల ఆటను చూడాల్సిందే!

పారిస్ ఒలింపిక్స్‌లో పలువురు దిగ్గజాలు ● చరిత్ర సృష్టించేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారి ఒలింపిక్స్‌లో పోటీపడితేనే తమ జీవితాశయం నెరవేరినట్లు చాలా మంది క్రీడాకారులు భావిస్తారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని కొందరు జాతీయ హీరోలుగా ఎదుగుతారు. ఒలింపిక్స్ పేరును ఎప్పుడు ప్రస్తావించినా తమ పేరును కూడా స్మరించుకునే విధంగా చరిత్రకెక్కుతారు. తమ అద్వితీయమైన ప్రదర్శనతో తమకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తారు. ఒలింపిక్స్‌లో పోటీపడటాన్ని... పతకాలను సాధించడాన్ని... ప్రపంచ రికార్డులు సృష్టించడాన్ని అలవాటుగా మార్చుకొని ఎవరికీ అందనంత ఎత్తులో నిలుస్తారు. మరో రెండు రోజుల్లో మొదలయ్యే పారిస్ ఒలింపిక్స్‌లోనూ పలు క్రీడాంశాల్లో దిగ్గజాలు మరోసారి తమ విన్యాసాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. అందులో కొందరి గురించి క్లుప్తంగా...


-సాక్షి క్రీడా విభాగం



సిమోన్ బైల్స్ (జిమ్నాస్టిక్స్)

మెరుపు తీగలా కదులుతూ... అలవోకగా పతకాలు గెలుస్తూ... ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో తనదైన ముద్ర వేసింది అమెరికాకు చెందిన సిమోన్ బైల్స్. 27 ఏళ్ల బైల్స్ వరుసగా మూడో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనుంది. 4 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న బైల్స్ ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో 4 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 23 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకుంది. 'పారిస్'లో బైల్స్ మరో పతకం నెగ్గితే ఒలింపిక్స్ చరిత్రలో అత్యధిక పతకాలు నెగ్గిన అమెరికన్ జిమ్నాస్ట్‌గా రికార్డు నెలకొల్పుతుంది. బైల్స్ ఐదు పతకాలు గెలిస్తే... ఒలింపిక్స్ చరిత్రలోనే 12 పతకాలతో అత్యధిక పతకాలు నెగ్గిన జిమ్నాస్ట్‌లలో లారిసా లాతినినా (రష్యా; 18 పతకాలు) తర్వాత రెండో స్థానానికి చేరుకుంటుంది.

ఎలూడ్ కిప్‌చోగి (అథ్లెటిక్స్)



లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్‌లో ఆఫ్రికా అథ్లెట్లకు తిరుగులేదు. పారిస్ ఒలింపిక్స్‌లో కెన్యాకు చెందిన 39 ఏళ్ల ఎలూడ్ కిప్‌చోగి గతంలో మారథాన్‌లో ఎవరికీ సాధ్యంకాని రికార్డును సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాడు. ఐదోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న కిప్‌చోగి 2004 ఏథెన్స్ గేమ్స్‌లో 5000 మీటర్లలో కాంస్యం, 2008 బీజింగ్ గేమ్స్‌లో 5000 మీటర్లలో రజతం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయిన కిప్‌చోగి ఆ తర్వాత మారథాన్ (42.195 కిలోమీటర్లు) వైపు మళ్లాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కిప్‌చోగి విజేతగా నిలిచి రెండు స్వర్ణాలు సాధించాడు. ఈ క్రమంలో అబెబె బికిలా (ఇథియోపియా), వాల్డెమర్ (జర్మనీ) తర్వాత ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో రెండు స్వర్ణాలు నెగ్గిన మూడో అథ్లెట్‌గా నిలిచాడు. పారిస్‌లోనూ కిప్‌చోగి పతకం లేదా స్వర్ణం నెగ్గితే ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో అత్యధికంగా మూడు పతకాలు నెగ్గిన ఏకైక అథ్లెట్‌గా చరిత్ర సృష్టిస్తాడు.

లెబ్రాన్ జేమ్స్ (బాస్కెట్‌బాల్)



ఒలింపిక్స్‌లో బాస్కెట్‌బాల్‌ను 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ క్రీడాంశంలో అమెరికాయే తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 1980 మాస్కో ఒలింపిక్స్‌ను బహిష్కరించిన అమెరికా జట్టు ఇప్పటి వరకు బాస్కెట్‌బాల్‌లో 16 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన అమెరికా ఆ తర్వాత వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణాలు సాధించింది. మరో స్వర్ణమే లక్ష్యంగా అమెరికా పారిస్ గేమ్స్‌లో అడుగు పెడుతుంది. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్ చరిత్రలో టాప్ స్కోరర్‌గా ఉన్న లెబ్రాన్ జేమ్స్ నాలుగోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్ తర్వాత మళ్లీ విశ్వ క్రీడల్లో ఆడుతున్న లెబ్రాన్ జేమ్స్ తన సహజశైలిలో ఆడితే ఈసారీ అమెరికాకు ఎదురుండదు.


మిజైన్ లోపెజ్ నునెజ్ (రెజ్లింగ్)



గ్రీకో రోమన్ స్టయిల్‌లో ఎదురులేని దిగ్గజ రెజ్లర్. క్యూబాకు చెందిన 41 ఏళ్ల నునెజ్ వరుసగా ఆరో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నాడు. ఇప్పటికే వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణ పతకాలను సాధించాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న నునెజ్ పురుషుల గ్రీకో రోమన్ 130 కేజీల విభాగంలో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా ఉన్నాడు. 2004 ఏథెన్స్‌లో 120 కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచిన నునెజ్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లలో 120 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించాడు. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లలో 130 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలను గెల్చుకున్నాడు. పారిస్ గేమ్స్‌లోనూ నునెజ్ పతకం సాధిస్తే... ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో ఐదు స్వర్ణాలు లేదా ఐదు పతకాలు నెగ్గిన ఏకైక రెజ్లర్‌గా ఘనత వహిస్తాడు.

టెడ్డీ రైనర్ (జూడో)

పురుషుల జూడో క్రీడాంశంలో 12 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఫ్రాన్స్ దిగ్గజం టెడ్డీ రైనర్ సొంతగడ్డపై రికార్డుపై గురి పెట్టాడు. వరుసగా ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న 35 ఏళ్ల టెడ్డీ రైనర్ ఒలింపిక్స్‌లో 3 స్వర్ణాలు, 2 కాంస్యాలు సాధించాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న టెడ్డీ పారిస్ ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్‌తోపాటు హెవీ వెయిట్ విభాగంలో బరిలోకి దిగుతాడు. ఈ రెండు విభాగాల్లోనూ టెడ్డీ స్వర్ణాలు సాధిస్తే ఫ్రాన్స్ తరఫున ఒలింపిక్స్ క్రీడల్లో అత్యధికంగా ఐదు స్వర్ణాలు గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఫ్రాన్స్ ఫెన్సర్లు లూసియన్ గాడిన్, క్రిస్టియన్ డోరియోలా గతంలో ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాల చొప్పున సాధించారు.



బైల్స్, లెబ్రాన్ జేమ్స్, కిప్‌చోగి, టెడ్డీ రైనర్, నునెజ్‌లే కాకుండా పోల్‌వాల్టర్ డుప్లాంటిస్ (స్వీడన్), టేబుల్ టెన్నిస్‌లో మా లాంగ్ (చైనా), స్విమ్మింగ్‌లో సెలెబ్ డ్రెసెల్ (అమెరికా), కేటీ లెడెకీ (అమెరికా) కూడా పారిస్ ఒలింపిక్స్‌లో కొత్త చరిత్రను లిఖించే దారిలో ఉన్నారు. వారందరికీ ఆల్ ద బెస్ట్!

సినిమా

రెప్పల్ డప్పల్


● రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రధారులు. పనోరమా స్టూడియోస్ అండ్ టి–సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పల్...' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

మళ్లీ ఎటో వెళ్లిపోయింది మనసు...

ప్రేమకథలను ఇష్టపడే వారి జాబితాలో 'ఎటో వెళ్లిపోయింది మనసు' (2012) సినిమా కూడా ఉంటుంది. నాని, సమంత లీడ్ రోల్స్‌లో నటించగా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. రేష్మా, ఎస్. వెంకట్, సి. కల్యాణ్, సీవీ రావు నిర్మించిన ఈ సినిమాకు ఇళయరాజా అందించిన బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా 'ఎటో వెళ్లిపోయింది మనసు' సినిమా రీ రిలీజ్ కానుంది. లక్ష్మీ నరసింహా మూవీస్ బ్యానర్ మీద సుప్రియ, శ్రీనివాస్ ఆగస్టు 2న ఈ సినిమాను మళ్లీ విడుదల చేయనున్నారు. ''ప్రస్తుతం తెలుగులో రీ–రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. ఈ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు నిర్మాతలు.


● సమంత
నాని

మరో ప్రేమకథ ఆరంభం


● నయనతార

ఇప్పటివరకూ పలు ప్రేమకథా చిత్రాల్లో నటించారు నయనతార. తాజాగా సిల్వర్ స్క్రీన్‌పై మరో రొమాంటిక్ లవ్ స్టోరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారీ బ్యూటీ. తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన విష్ణు ఎడవన్ ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మధ్య వయస్కురాలైన ఓ మహిళ, ఓ కుర్రాడి మధ్య ఉన్న ప్రేమ బంధాన్ని నేటి సమాజం ఎలా చూస్తుంది? అనేది ఈ చిత్రం ప్రధానాంశమని కోలీవుడ్ సమాచారం. మధ్యవయస్కురాలి పాత్రలో నయనతార, కుర్రాడి పాత్రలో కెవిన్ కనిపిస్తారు. ప్రస్తుతం నయనతార, కెవిన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు విష్ణు. లలిత్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

మేమే... మేమే...



● సూర్య

'ఆది జ్వాల... అనంత జ్వాల... వైర జ్వాల... వీర జ్వాల.. దైవ జ్వాల... దావాగ్ని జ్వాల...' అంటూ మొదలవుతుంది 'కంగువా' సినిమాలోని ఫైర్ సాంగ్. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రలు పోషించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదల కానుంది. మంగళవారం సూర్య బర్త్ డే సందర్భంగా 'కంగువా' సినిమాలోని 'ఫైర్ సాంగ్' లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''ఈ మట్టి ముట్టే ముందే ఇక్కడ పుట్టింది మేమే మేమే... అంకెలు పుట్టక ముందే లెక్కలు కనిపెట్టింది మేమే మేమే...' అనే లిరిక్స్‌తో సాగే ఈ పాట తెలుగు వెర్షన్‌కు శ్రీమణి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, దీప్తీ సురేష్ ఆలపించారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ది వన్... హీరో సూర్య, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ వీడియోలో 'ది వన్' అని ఉంది. దాంతో ఈ సినిమా టైటిల్ 'ది వన్' అనే ప్రచారం జరుగుతోంది. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రాన్ని జ్యోతిక, సూర్య, కార్తీక్ సుబ్బరాజు నిర్మిస్తున్నారు.

అశ్విన్ కెరీర్‌లో శివం భజే నిలిచిపోతుంది - విశ్వక్ సేన్


● అనిల్ రావిపూడి, విశ్వక్ సేన్, అశ్విన్‌బాబు, తమన్

''శివం భజే' ట్రైలర్ బాగుంది. నేపథ్య సంగీతం అదిరిపోయింది. ఆగస్టు 1న అశ్విన్‌కు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాను. తన కెరీర్‌లో 'శివం భజే' నిలిచిపోతుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జోడీగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శివం భజే'. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదలవుతోంది. మంగళవారం జరిగిన 'శివం భజే' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''శివం భజే' ట్రైలర్ బాగుంది. యూనిట్‌కి ఈ చిత్రం మంచి విజయాన్ని అందించాలి'' అన్నారు అనిల్ రావిపూడి. ''అశ్విన్ క్రికెట్‌లో బాల్‌ను ఎలా బాదుతాడో బాక్సాఫీస్‌ను కూడా అలానే బాదాలి'' అన్నారు తమన్. ''పరమేశ్వరుడి కథతో రూపొందిన ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు అప్సర్. ''ముస్లిం అయిన అప్సర్‌గారు 'శివం భజే' లాంటి కథను ఎలా రాశారో అనుకున్నాను. ఇదంతా శివ లీల అనిపించింది'' అని అన్నారు అశ్విన్‌బాబు.

ఆ ఫైర్‌తో డైరెక్టర్ అయ్యా! - బండి సరోజ్ కుమార్



''నేను గతంలో 'నిర్బంధం, నిర్బంధం 2 , మాంగల్యం' వంటి సినిమాలు తీశాను. వాటిని కొన్ని వర్గాల ప్రేక్షకులు మాత్రమే చూశారు. కానీ 'పరాక్రమం' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులు చూడొచ్చు'' అని బండి సరోజ్ కుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, నాగ లక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ మూవీ ఆగస్టు 22న విడుదల కానుంది. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''సంఘర్షణతో కూడుకున్న కథే 'పరాక్రమం'. నేను ఇండస్ట్రీకి రాక ముందు ఓ హాస్టల్‌లో ఉండేవాణ్ని. ఓ రోజు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తుంటే.. 'క్రికెటర్ అవుతావా? మీ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? వెనక చూసి ముందుకు వెళ్లాలి బ్రదర్' అని ఓ వ్యక్తి అన్న మాటలు నాలో కసిని నింపాయి. ఏదో ఒకరోజు అతను నన్ను తలెత్తుకుని చూడాలనుకున్నాను.. ఆ ఫైర్‌తోనే డైరెక్టర్ అయ్యాను'' అన్నారు.

నాలుగువందల ఏళ్ల నాటి గుడి కథతో...


● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఓ పురాతన గుడి ముందు తుపాకీ పట్టుకుని నిల్చున్నారు హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆ గుడి నాలుగు వందల ఏళ్ల క్రితం నాటిది. ఆ గుడికి హీరో ఎందుకు వెళ్లాలనుకుంటాడు? అనేది తెలుసుకోవడానికి కాస్త సమయం ఉంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఓ సినిమాను నిర్మిస్తున్నారు. దివంగత ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ 75వ జయంతి, హీరో శ్రీనివాస్ ఇండస్ట్రీలోకి నటుడిగా వచ్చి పదేళ్లు పూర్తి కావడం... ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని ఈ సినిమాను మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే మొదలైంది. జూలై 24న రెండో షెడ్యూల్‌ను మొదలు పెట్టనున్నాం. కమర్షియల్ అంశాలతో కూడిన శక్తివంతమైన, ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు లుధీర్'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

సరికొత్తగా కనిపిస్తాను - రక్షిత్ అట్లూరి



''పలాస 1978, నరకాసుర' చిత్రాల తర్వాత అన్నీ సీరియస్ రోల్స్ చేస్తున్నానని చాలామంది అన్నారు. కానీ 'ఆపరేషన్ రావణ్, శశివదనే' సినిమాల్లో నా పాత్రలు సీరియస్‌గా ఉండవు. ఈ సినిమాల్లో సరికొత్తగా కనిపిస్తాను. 'ఆపరేషన్ రావణ్' నన్ను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసే సినిమా అవుతుంది'' అని రక్షిత్ అట్లూరి అన్నారు. వెంకట సత్య దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ– ''యువ ప్రేక్షకులకు చేరువ అయ్యేలా థ్రిల్లర్ మూవీ నిర్మిస్తే బాగుంటుందని 'ఆపరేషన్ రావణ్'ని తీశాం. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో మా నాన్న వెంకట సత్యంగారి డైరెక్షన్ పట్ల నాతో పాటు రాధిక, చరణ్ రాజ్‌గార్లు కూడా సంతోషంగా ఫీలయ్యారు. ఈ సినిమాలో మనలోని ఆలోచనల అంతర్యుద్ధాన్ని చూపించే ప్రయత్నం చేశాం. ఇలాంటి థ్రిల్లర్ సినిమాను థియేటర్‌లో చూస్తేనే ఆ అనుభూతి కలుగుతుంది. ప్రస్తుతం 'పలాస 2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది'' అన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పురుషోత్తముడు'. హాసినీ సుధీర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, మురళీ శర్మ, రమ్యకృష్ణ, బ్రహ్మానందం, ముఖేష్ ఖన్నా ఇతర కీలక పాత్రల్లో నటించారు. రామ్ భీమన దర్శకత్వంలో డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ భీమన మాట్లాడుతూ– ''దర్శకుడిగా నేను 'ఆకతాయి, హమ్ తుమ్' అనే రెండు సినిమాలు చేశాను. ఆ తర్వాత ఆరేళ్లకు నాకు 'పురుషోత్తముడు' చాన్స్ వచ్చింది. విజయం సాధించాలనే పట్టుదలతో ఈ సినిమా చేశాను'' అన్నారు. ''మంచి క్లీన్ ఎంటర్‌టైనర్ మూవీ తీశామని గర్వంగా చెప్పగలం'' అన్నారు రమేశ్ తేజావత్. ''పురుషోత్తముడు'లో మంచి పోలీసాఫీసర్ రోల్ చేశాను. ఈ సినిమా సక్సెస్ కావాలి'' అన్నారు బ్రహ్మానందం. ''ఈ సినిమాలో నటించడాన్ని ఆస్వాదించా. రాజ్ తరుణ్ ఈ ప్రెస్‌మీట్‌కు రాలేదు. త్వరలోనే ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడతారు'' అన్నారు రాజా రవీంద్ర. ''నాది మహారాష్ట్ర. నన్ను తెలుగు అమ్మాయిలా ఆదరించాలని కోరుకుంటున్నాను. ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు హాసినీ సుధీర్.


● హాసినీ సుధీర్